ప్రజాశక్తి
5
మంగళవారం 4 జూన్ 2024
అల్లూరి సీతారామరాజు

బాధితునికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీ కరకవలస గ్రామానికి చెందిన గుబ్బయి గుండు (51) పశువుల కాసేందుకు వెళ్లగా ఆదివారం ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడటంతో తీవ్ర గాయలతో అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు అరకు ఏరియా ఆసుపత్రిలో పర్యటించి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌లను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం కుదుటపడే వరకు ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి 5 కేజీల కందిపప్పు, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శిస్తున్న సిపిఎం నేత

అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్...

-నేడే ఓట్ల లెక్కింపు-కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు

అల్లూరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈనెల 4న మంగళవారం జరగనుంది. ఉదయం 5 గంటలకే కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు చేరుకొని ఓట్ల లెక్కింపునకు సిద్ధం కానున్నారు.జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పాడేరు, రంపచోడవరం డివిజన్లో రెండు చోట్ల నిర్వహిస్తున్నారు. ఈ నియోజకవర్గాలలో పోలైన అసెంబ్లీ లోక్‌సభ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు ఇక్కడ నిర్వహించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత పర్యవేక్షణలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించారు. ఫలితాలపై అభ్యర్థులు టెన్షన్‌గా ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి -పాడేరు: కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తలు చేపట్టారు. స్ట్రాంగ్ రూముల సీలు తీసిన దగ్గర నుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి అంశం వీడియో చిత్రీకరణ జరిగే విధంగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చర్యలు చేపట్టారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లు ఎవ్వరికీ మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు వెళ్లడానికి అనుమతి లేదు.

కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు

అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, అరకు పార్లమెంటుకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం , పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

పోలైన ఓట్లు, లెక్కింపు ఇలా..

అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలలో పోలైన 1,74588 ఓట్లు, పాడేరులో 318 పోలింగ్ కేంద్రాల్లో పోలైన 1,58,757 ఓట్లు, రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాల్లో పోలైన 2,08,025 ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. అరకు అసెంబ్లీ కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పాడేరు అసెంబ్లీ కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, రంపచోడవరంలో 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. అరకులో 22 రౌండ్లు లెక్కింపు ఉంటుందని, పాడేరులో 23రౌండ్లు, రంప చోడవరంలో 20 రౌండ్లు లెక్కింపు జరుగుతుందని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి విజయ సునీత తెలిపారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు

ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు జరుగుతుందని అరకులో 3492, పాడేరులో 2546, రంప చోడవరం లో 4123 కలిపి మొత్తం 10,161 పోస్టల్ బ్యాలెట్లతో పాటు అప్పటి వరకు అందిన సర్వీసు ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 113 మంది నుంచి సర్వీస్ ఓట్లు చేరాయని కలెక్టర్ వెల్లడించారు. ఓట్ల లెక్కింపులో ఎటువంటి లోటు పాట్లు జరగకుండా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు

కౌంటింగ్ సిబ్బందిని అరకు, పాడేరు నుండి రంపచోడవరంకు, రంపచోడవరం నుండి పాడేరు, అరకుకు తరలించ డానికి అవసరమైన బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు., కౌంటింగ్ కేంద్రాల వద్ద బయోటాయిలెట్ల ఏర్పాటుకు, అంబులెన్స్, వైద్య శిభిరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు., నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ ఏర్పాటుకు, అగ్నిమాపక పరికరాలు, శకటం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకున్నారు.

మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో మూడంచెల భద్రతా చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది ఏజెంట్లు తదితరులను వంద మీటర్ల ఫరిధిలో గుర్తింపు కార్డు తనిఖీ చేసి మాత్రమే కౌంటింగ్ కేంద్రానికి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. రెండవ దశలో గ్యాంగ్ వే లకు పంపించే ముందు మెటల్ డిటెక్టర్ తనిఖీ, ఎటువంటి ఎలక్ట్రానిక్ డివైజ్లు, మొబైల్స్ లోపలికి అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. మూడవ దశలో సిఆర్పిఎఫ్ భద్రత ఏర్పాటు చేశారు.

గెలుపెవరిదో?

పాడేరు: అల్లూరి జిల్లాలో మూడు ఎస్టీ రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అరకు, పాడేరు, రంపచోడవరం మూడు అసెంబ్లీ స్థానాలకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానంగా ముక్కోణపు పోటీ జరిగింది. అరకు అసెంబ్లీ స్థానానికి 17 మంది. పాడేరులో 16 మంది, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా ఈ మూడు నియోజకవర్గాల్లో ముగ్గురు అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ సాగింది. పాడేరు అసెంబ్లీ స్థానానికి వైసిపి అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, టిడిపి అభ్యర్థి ఈశ్వరి, కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబుల మధ్య ప్రధాన పోటీ సాగింది. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, టిడిపి అభ్యర్థి మిరియాల శిరీష, సిపిఎం అభ్యర్థి లోతా రామారావు ల మధ్య పోటీ నెలకొంది. అరుకు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి రేగం మత్స్యలింగం, బిజెపి అభ్యర్థి పాంగి రాజారావు, కాంగ్రెస్ అభ్యర్థి శెట్టి గంగాధర స్వామిల మధ్య పోటీ జరిగింది.అరుకు సిట్టింగ్ ఎంపి మాధవితో పాటు పాడేరు అరకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణలకు ఈసారి వైసిపి సీట్లు ఇవ్వలేదు.పాడేరు అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ గెలిచి 2017లో టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఈ సారి ఎట్టకేలకు చివరికి ఆమె టిడిపి అభ్యర్థిగా పోటీలో నిలిచారు. వైసిపి అభ్యర్థి శతక బుల్లిబాబు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.అరకు లోక్‌సభకు వైసిపి నుంచి తనూజారాణి, బిజెపి నుంచి కొత్తపల్లి గీత, సిపిఎం అభ్యర్థిగా అప్పలనరస బరిలో నిలిచారు.

కౌంటింగ్ కేంద్రం

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

-జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పాడేరు, అరకు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లు ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పకడ్బందీగా పూర్తి చేశామని తెలిపారు. అరకులో 22 రౌండ్లు, పాడేరులో 23 రౌండ్లు, రంపచోడవరంలో 20 రౌండ్లలో ఇవిఎంల లెక్కింపు పూర్తవుతుందని, అది కాక ఇటిపిబి మరియు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకు వేర్వేరు టేబుల్స్ ఏర్పాటు చేసామన్నారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు కలిపి మూడు వేలకు పైగా సిబ్బంది కౌంటింగ్‌లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి భావన వశిష్ఠ్, పిఒ వి.అభిషేక్, డిఆర్‌ఓ బి.పద్మావతి పాల్గొన్నారు.

ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఓట్లు లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ఓట్లు లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-రంపచోడవరం

మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం జరగనున్న ఓట్లు లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ప్రతిష్టాత్మకమైన భద్రత వలయంలో ఈ కౌంటింగ్ జరుగుతుందన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్లమెంటుకు 20 కౌంటింగ్ టేబులు, అసెంబ్లీకి 20 కౌంటింగ్ టేబుల్ ఏర్పాటు చేశామని, ఒక్కొక్క టేబుల్‌కు నలుగురు చొప్పున కౌంటింగ్ సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు. ఈ విధంగా అసెంబ్లీకి 80 మంది, పార్లమెంటుకు 80 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన 12 మంది అభ్యర్థులు ఒక్కొక్క టేబుల్‌కు ఒక్కొక్క ఏజెంట్‌ను నియమించవచ్చని ఇప్పటికే తెలియజేశామని పేర్కొన్నారు. రెవిన్యూ శాఖ నుండి మరో 200 మంది అధికారులు, సిబ్బందిని కౌంటింగ్ విధుల కోసం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ ఆడహళ్లి మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడానికి కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ప్రతిష్టాత్మకమైన భద్రత ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. నలుగురు కంటే ఎక్కువ మంది గుంపులు గుంపులుగా ప్రజలు తిరగరాదని, ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని, బాణసంచా కాల్చరాదని స్పష్టం చేశారు. బయట గ్రామాల వ్యక్తులకు మంగళవారం రంపచోడవరం గ్రామంలోకి ప్రవేశం లేదని, వారి నియంత్రణకు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది ఇలా ఉండగా, ఓట్లు లెక్కింపు కేంద్రాన్ని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే సోమవారం పరిశీలించి ఏర్పాట్లును పరిశీలించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి -సీలేరు

ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ పార్టీ నాయకులు, వారి మద్దతుదారులు అల్లర్లు, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని జికె.వీధి సిఐ అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. క్షణికావేశాలకు పోయి గొడవలు తెచ్చుకోవద్దని, కేసుల్లో ఇరుక్కొని జీవితాలు పాడు చేసుకోవద్దని హితవుపలికారు. ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ జరిగేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు అనుమతులు ఉన్న వారికే మాత్రమే కౌంటింగ్ వద్దకు వెళ్లేందుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లకు, విలేకరులకు ఎన్నికల సిబ్బందికి మాత్రమే పాడేరు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లడానికి అనుమతి ఉందని స్పష్టం చేశారు.

కడరేవులో విష జ్వరాలు

-వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గుమ్మ పంచాయతీ కడరేవు గ్రామంలో విష జ్వరాలతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సబ్యుడు కె.గోవిందరావు తెలిపారు. పెదకోట పంచాయతీ మడ్రెబు గ్రామానికి చెందిన లుదియా అనే చిన్నారి అనారోగ్యంతో గత నెల 30న మృతి చెందిందన్నారు. కడరేవు గ్రామానికి చెందిన రాప లుదియా (5) వైద్యం కోసం దేవరాపల్లి ఆసుపత్రికి తరలించగా మలేరియా నిర్ధారణ అయ్యిందన్నారు. అలాగే జ్వరాలతో రాప మిరికి, బడ్నాయిని ముత్యాలమ్మ, రాప సోనియా, జన్ని సన్యాసిరావు, రాప లక్ష్మి, రాప ఎర్రి అమ్మతో పాటు మరో ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. తక్షణమే గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

దేవరాపల్లి ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతున్న లుదియా

విజయోత్సవ ర్యాలీలు నిర్వహించొద్దు

ప్రజాశక్తి-హుకుంపేట:ఎన్నికల కౌంటింగ్ అనంతతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించ వద్దని స్థానిక ఎస్సై బి.సతీష్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. మందు గుండు సామగ్రి ఉపయోగించ కూడదన్నారు. పార్టీ కార్యక్రమాలు గుంపులుగా చేపడితే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

చింతపల్లి :కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో 144 సెక్షన్ విధించడం జరిగిందని చింతపల్లి సీఐ రమేష్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాడేరు వెళ్లడానికి వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజలకు అనుమతి లేదన్నారు.కౌంటింగ్ కు సంబంధించి ఎన్నికల కమిషన్ పాస్‌లు జారీ చేసిన ఏజెంట్లు, పాత్రికేయులు మాత్రమే పాడేరు వెళుటకు అనుమతి ఉందన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు.

పెదబయలు : కౌంటింగ్ సందర్భంగా ప్రజలందరూ గమనించి నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ కోరారు.144 సెక్షన్ అమలులో ఉన్నందున 4 గురు లేదా అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తులు ఒక చోట గుమికూడి వుండరాదని, మీటింగులు పెట్టరాదని సూచించారు. ప్రజలు గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు చేయ కూడదని కోరారు.

జలాశయంలో గిరిజనుడు గల్లంతు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని తాజంగి జలాశయంలో స్నానానికి దిగిన గిరిజనుడు గల్లంతయ్యాడు. తాజంగి గ్రామంలోని సిరగంపుట్టు వీధికి చెందిన బురిటి గురుమూర్తి జలాశయంలో స్నానానికి దిగి లోతట్టు ప్రాంతంలో గల్లంతయ్యాడు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో దహన సంస్కారాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం జలాశయంలో స్నానం చేస్తూ లోతట్టు ప్రాంతానికి వెళ్లిన గురుమూర్తి ఎంతసేపటికి గట్టుకు రాకపోవడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పింఛన్ల కోసం పడిగాపులు

నెట్, విద్యుత్ అంతరాయం కారణంగా రోజంతా నిరీక్షణ

సీలేరు యూనియన్ బ్యాంక్ వరండాలో నిరీక్షిస్తున్న పింఛను లబ్ధిదారులు

ప్రజాశక్తి-సీలేరు

రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా పింఛన్లు అందించడంతో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. జీకే వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంకులో పింఛన్లు తీసుకోవటానికి సోమవారం ఉదయం 9 గంటల నుంచే ఆ బ్యాంకు వద్ద బారులు తీరారు. సీలేరు, దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల నుంచి వికలాంగులు, వృద్ధులు, వితంతువులు బ్యాంకు నుంచి సొమ్మును విత్ డ్రా చేసుకోవడానికి తండోపతండాలుగా తరలివచ్చారు. అయితే బిఎస్ఎన్ఎల్ నెట్ సక్రమంగా పనిచేయకపోవడంతో గంటల తరబడి పింఛన్‌దారులు నిరీక్షించవలసిన దుస్థితి నెలకొంది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో బ్యాంకు సిబ్బందికి పింఛన్లు పంపిణీ తలనొప్పిగా మారింది. మరోపక్క సీలేరు పంచాయతీ పరిధి పార్వతీనగర్ వద్ద విద్యుత్ లైన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలను సరి చేయడానికి ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను ఉదయం 10.30 గంటలకు నిలిపివేశారు. సాంకేతిక లోపాలు సరిచేసి మధ్యాహ్నం ఒంటి గంటకి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. అప్పటివరకు పింఛన్లు పంపిణీ స్తంభించిపోయింది. దీంతో గత్యంతరం లేక పింఛన్ లబ్ధిదారులు బ్యాంకు వరండాలో పడిగాపులు కాశారు. విద్యుత్ పునరుద్ధరణ అనంతరం పింఛన్ల పంపిణీకి బ్యాంకు సిబ్బంది చర్యలు చేపట్టారు. వాలంటీర్ వ్యవస్థ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో తమకు ఈ కష్టాలు తప్పడం లేదని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటర్ల మేర కాలినడకన సీలేరు యూనియన్ బ్యాంకు వచ్చి పింఛన్లు విత్ డ్రా చేసుకొని తిరిగి ఇంటికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వాలంటీర్లు తమ ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే వారిని, అటువంటిది పింఛన్ సొమ్మును బ్యాంకులో జమ చేయడం వల్ల నెట్‌వర్కు, విద్యుత్తు సరఫరా అంతరాయాలు తమకు శాపంగా మారినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి తమ ఇళ్ల వద్దే పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పింఛనుదారుల అవస్థలు

హుకుంపేట : స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద పింఛన్లు సొమ్ము తీసుకునేందుకు ఫించనుదారులు బారులు తీరారు. సోమవారం పింఛన్లు తీసుకునేందుకు వచ్చిన వృద్ధులతో బ్యాంక్ ఆఫ్ బరోడా కిక్కిరిసింది. మండలంలోని 33 పంచాయతీలకు చెందిన వారంతా పింఛన్ సొమ్ము తీసుకునేందుకు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జనాలతో బ్యాంకు కిటకిటలాడింది. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ పింఛన్దారులకు ఇబ్బంది కలగకుండా టెంటు ఏర్పాటు చేశారు. డబ్బులు ఇచ్చేందుకు పది మంది సిబ్బందితో సేవలను అందించారు.

హుకుంపేటలో పింఛను సొమ్ము కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన లబ్ధిదారులు

చెరుకుంపాలెం చెక్ పోస్టును పరిశీలిస్తున్న సిఐ సన్యాసినాయుడు తదితరులు

101మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సార్వత్రిక ఎన్నికలు ఓట్లు లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపారు. మండలంలోని చెరుకుంపాలెంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంతగా ఆయన మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు నేపథ్యంలో మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లో పరిధిలో రౌడీ షీటర్లు, జూదరులు, సారా వ్యాపారులు తదితర 101 మందిపై ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రంపచోడవరంలో నిర్వహిస్తున్న ఓట్లు లెక్కింపునకు మండలం నుండి పాస్‌లు ఉన్న కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే పంపించేందుకు వీలుగా మండలంలోని చెరుకుంపాలెం గ్రామం వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున కౌంటింగ్ పాస్ లేనివారికి అనుమతులు లేవని నిబంధన అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిస్క్ ఇన్సులేటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీప దుర్గా దేవి ఆలయం వెనుక కొండపై ఉన్న లెవెన్ కెవి నుంచి సీలేరుకు విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ స్తంభానికి డిస్క్ ఇన్సులేటర్లు రెండు శిధిలావస్థకు చేరుకోవడంతో సోమవారం కొత్తవాటిని ఏర్పాటు చేశారు. ఏపీ జెన్కో డిస్ట్రిబ్యూషన్ ఏఈ కిరణ్ కుమార్ తమ సిబ్బందితో లెవెన్ కెవి విద్యుత్ స్తంభం దగ్గర పరిశీలించగా డిస్క్ ఇన్సులేటర్ రెండు శిధిలావస్థకు చేరుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వాటి స్థానంలో నూతన డిస్క్ ఇన్సులేటర్లను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరుకు విద్యుత్ సరఫరాలో అప్పుడప్పుడు సాంకేతికపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో సోమవారం తనిఖీలు చేసి డిస్క్ ఇన్సులేటర్లని అమర్చుమని చెప్పారు.

ధనుంజయ్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికుడు కొర్ర ధనుంజయ్ మే 31న ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సంఘం కార్యాలయంలో సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యూనియన్ బ్రాంచి గౌరవాధ్యక్షులు ఎస్‌కె.సుభాన్, అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్, తోటి కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగ విరమణ చేసిన ధనుంజయ్‌ను దుస్సాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, విష్ణుకుమార్ మాట్లాడుతూ ధనుంజయ్ కాంట్రాక్ట్ కార్మికునిగా 20 ఏళ్ల పాటు తన విధులను చక్కగా నిర్వర్తించారని కొనియాడారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని, నాడు వైసిపి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తనను ఏదో రోజు రెగ్యులరైజ్ చేస్తారని ఆశించారని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చివరికి కాంట్రాక్ట్ కార్మికునిగానే ధనుంజయ్ రిటైర్మెంట్ కావడం బాధాకరమని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ వయోపరిమితి దగ్గర పడుతున్నా ప్రభుత్వం మాత్రం రెగ్యులరైజ్, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. కనీసం డైరెక్ట్ పేమెంట్ కూడా చేయడానికి యాజమాన్యం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు, యూనియన్ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన కాంట్రాక్టు కార్మికుడు ధనుంజయ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

హాకీ క్రీడాకారుడి ప్రతిభ

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారుడు కొల్నాటి వెంకటేష్ బెంగుళూరు ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికైనట్లు హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు తెలిపారు. ఆల్ ఇండియా ఓపెన్ సెలక్షన్స్, ఎడ్యూకేషన్స్ ఆఫ్ యంగ్ ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ ఎమ్.ఈ.జి సెంటర్ బెంగళూరులో ఫిబ్రవరి 5 నుండి 8 వరకు కేంద్రీయ విద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన సెలక్షన్‌లో వెంకటేష్ ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. వెంకటేష్‌కు చదువుతోపాటు,హాకీ క్రీడ పై ప్రత్యేక శిక్షణ ఇస్తారని, భోజనం, వసతి సౌకర్యం కూడా కల్పిస్తారని తెలిపారు.వెంకటేష్ ఎంపిక పట్ల హాకీ క్లబ్ కార్యదర్శి కే తాతాజీ, తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

గంటాను కలిసిన నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును సోమవారం విశాఖలో ఆయన నివాసంలో స్థానిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి నాయకులు మీగడ సత్తిబాబు, కర్రి వెంకట సత్యనారాయణ (కెవి), జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా సుధాకర్ తదితరులు కలిసి ఉపమాక వెంకన్న చిత్రపటాన్ని అందజేశారు.

కౌంటింగ్‌కు వెళ్లిన వైసిపి అభ్యర్థి గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో నర్సీపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ కౌంటింగ్ కేంద్రమైన అనకాపల్లికి సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో మళ్లీ వైసీపీ జెండా ఎగరబోతుందని, భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పాత నగరం గొల్లవీధి మసీదు జంక్షన్ సమీపంలో డోరు నెంబరు 20-100 ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలింది. గత కొంత కాలంగా ఆ ఇల్లు ఖాళీగానే ఉంది. ఇంటి యజమాని కాశీ ఇక్కడ ఉండడం లేదు. ఇంటికి హౌస్ ఫర్ టులెట్, హౌస్ ఫర్ సేల్ అని బోర్డు పెట్టారు. ఇంటిలో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదవే తప్పింది. ఆ ఇంటికి ఆనుకొని ఉన్న పోర్షన్ వారు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. ఇల్లు కూలిందని సమాచారం ఇచ్చినా ఆ ఇంటి యజమాని రాలేదని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలిన ఇంటికి సంబంధించిన విద్యుత్ వైర్లు నడిరోడ్డుపై వేలాడుతున్నాయి. విద్యుత్ సిబ్బందికి, పోలీసులకు, జివిఎంసి దృష్టికి తీసుకెళ్లినా ఉదయం 10 గంటల వరకు ఎవరూ రాలేదని, వేలాడుతున్న విద్యుత్ వైర్లలో విద్యుత్ సరఫరా ఇంకా ఉందని, తమకు భయంగా ఉందని స్థానికులు మీడియా వద్ద ఆవేదన వెలిబుచ్చారు.

రైళ్ల రద్దు, రీషెడ్యూల్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సౌత్ ఈస్టర్న్ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా సంబంధిత అభివృద్ధి పనుల కారణంగా పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. 18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 18108 జగదల్పూర్ - రూర్కెలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 18117 రూర్కెలా - గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, 18118 గుణుపూర్ - రూర్కెలా రాజ్య రాణి ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 5వ తేదీన రద్దు చేశారు.

రీషెడ్యూల్ రైలు

18311 విశాఖపట్నం-బెనారస్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5వ తేదీన షెడ్యూల్ సమయం ఉదయం 4.20 గంటలకు బదులు 2 గంటల 45 నిమిషాలు ఆలస్యంగా 7.05 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరుతుందని, ప్రయాణికులు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

6, 7న బస్సు పాస్ కౌంటర్లు పనిచేయవు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బస్సు పాస్ అప్లికేషన్ ఆధునీకరిస్తున్న కారణంగా ఆ కౌంటర్లు గురు, శుక్రవారాలు పనిచేయవని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.అప్పలరాజు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి బస్సు పాస్ చేయించుకునే వారు కొత్తగా ఐడి కార్డు చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బస్సు పాస్ వినియోగదారులు గమనించాలని కోరారు. శనివారం నుంచి యథావిధిగా బస్సు పాస్ కౌంటర్లు పని చేస్తాయని తెలిపారు.

రోడ్డు వెడల్పుతో తీవ్ర నష్టం

- అధికారులకు గ్రామస్తుల వినతి

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -అనంతగిరి:పర్యాటక ప్రాంతమైన తాడిగుడ జలపాతానికి నిర్మించే రోడ్డు వెడల్పు కొలతలు తక్షణమే తగ్గించాలని వైఎస్ఆర్ వీధి, పెద్దూరు గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం రెవిన్యూ మండల పరిషత్ అధికారులకు కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పి.సోమర, డి.దొనెష్, ఎం.జోకులు, రవిలు మాట్లాడుతూ, తమ రెండు గ్రామాల మధ్య నుండి తాడిగూడ జలపాతానికి రహదారి ఉందని, దీన్ని 30 అడుగుల విస్తీర్ణం రోడ్డు ఏర్పాటు చేసేందుకు ట్రైబల్ వెల్ఫేర్, రెవిన్యూ శాఖ మండల అధికారులు మూడు రోజుల క్రితం కొలతలు తీశారని తెలిపారు. రోడ్డు ఏర్పాటుతో గృహాలతో పాటు కిరాణా దుకాణాలు దెబ్బ తింటాయన్నారు.

మైదాన ప్రాంతాల్లో భారీ వర్షం

- ⏩పొలాల్లో చేరిన వర్షపు నీరు
- ⏩దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు
- ⏩పిడుగు పడి గేదె మృతి
- ⏩యలమంచిలిలో 69.8 మిల్లీమీటర్ల
- ⏩వర్షపాతం నమోదు

ప్రజాశక్తి -యంత్రాంగం

నక్కపల్లి:మండలంలోని ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. లోతట్టి ప్రాంతాలు, పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఉరుములు, మెరుపులకు జనం భయాందోళన చెందారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు గాలులకు నక్కపల్లి, గొడిచెర్లలో రెండు విద్యుత్ స్థంభాలు నేల కొరిగాయి. చినదొడ్డిగల్లు, వేంపాడు గ్రామాల్లో రెండు విద్యుత్ స్థంభాలపై చెట్లు పడిపోవడంతో దెబ్బతిన్నాయి. దీంతో, ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

చెరువును తలపించి బలిఘట్టం రోడ్డు

నర్సీపట్నం టౌన్:భారీ వర్షం కారణంగా నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. దీంతో, నర్సీపట్నం-తుని రహదారిపై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో రహదారి మార్గంలో ఆటో బోల్తా పడింది.

కోటవురట్ల:మండలంలో ఆదివారం రాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి వరాహ, సర్పా నదులు పొంగి ప్రవహిస్తున్నాయి దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా పందూరు గ్రామానికి వెళ్లే కాలిబాట వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో గ్రామానికి వెళ్లేందుకు పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,

కోటవురట్ల నుండి రాజుపేట వెళ్లే దారి వద్ద నది దాటి వెళ్లేందుకు రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డురోడ్డు వెళ్లే రహదారి ప్రధానంగా పందూరు నుంచి అడ్డ రోడ్డు వెళ్లే వరకు రోడ్డు గోతులలో నీరు నిండి అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జల్లూరు వంతెన పై గోతుల్లో నీరు చేరడంతో ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు వర్షాలు కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం హైస్కూల్ సమీపాన ఇళ్లు జలమయమయ్యాయి. చిటికెల వీధి, హైస్కూల్ వీధిల్లో వర్షం నీరు ఇళ్ళలోకి, పాకల్లోకి నీరింది. సంబందిత అధికారులు స్పందించి మూసివేసిన డ్రైనేజీ తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

పిడుగుపడి గేదె మృతి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొవ్వూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి గ్రామానికి చెందిన రైతు మాసాడ శంకరరావుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. గేదె మృతితో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోతున్నారు. 9 నెలల చూడి గేదె మృతి చెందటంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

యలమంచిలిలో 69.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

యలమంచిలి : ఇటీవల చిన్న చిన్న వర్షపు జల్లులు రెండు మూడు పడ్డా ఆదివారం అర్ధరాత్రి పడిన వర్షం వాతావరణాన్ని పూర్తిగా చల్లబరిచింది. తొలకరి జల్లుల తొలి పలకరింపుతోనే పుడమితల్లి ఒళ్లు పులకరించింది. సోమవారం ఉదయానికి రెవెన్యూ కార్యాలయలంలో 69.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈదురు గాలులు, ఉరుముల శబ్దాలు నిద్రావస్థలోని ప్రజలకు నిద్రా భంగం కలిగించాయి. అంతలోనే విద్యుత్‌కు అంతరాయం కలిగింది. అర్ధరాత్రి నుంచీ యలమంచిలి అంధకారంలో మునిగిపోయింది. విద్యుత్ లేక చాలా మంది దోమలతో సతమతమయ్యారు. భారీ వర్షానికి పట్టణంలోని లొతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రామనగర్ ఇళ్ల మధ్య వర్షం నీరు నిలిచిపోయింది. రాజీవ్ క్రీడా మైదానం వర్షపు నీట మునిగింది. తెల్లవారే సరికి విద్యుత్ పునరుద్ధరించడంతో పురప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం రైతులకెంతో ఉపయోగపడుతుందని వ్యవసాధికార్లు పేర్కొన్నారు. వరి విత్తనాలు జల్లుకోవడానికి అనువైన వాతావరణం ఏర్పడిందన్నారు. అరటి, కొబ్బరి తోటలకు వర్షం బాగా ఉపయోగపడుతుందని చెప్పారు.

బుచ్చయ్యపేట : భానుడు భగభగల మధ్య వరుణుడు రాకతో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా మేఘాలు కొమ్ముకొని ఉరుములు మెరుపులు ప్రారంభమై గ్రామాల్లో రెండు మూడు గంటల పాటు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులకు పలు గ్రామాల్లో ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి. ఉక్కపోతతో విలవిలలాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. వ్యవసాయ పనులకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని తూటంగి పంచాయతీ గేదలబంద గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు. గేదలబంద గ్రామానికి చెందిన తాంగుల సతీష్ కుమార్, మరో యువకుడు బైకుపై పెదబయలు మండలానికి బయలుదేరారు. పెదబయలు మండలానికి చేరుకునే క్రమంలో ఒడిశా రాష్ట్రం సుడుం గ్రామంలో బైకు అదుపి తప్పింది. బైకుపై ప్రయాణిస్తున్న యువకులు చెల్లా చెదురుగా పడిపోయారు. గమనించిన స్థానికులు గాయాలతో కొట్టుమిట్టడాడుతున్న యువకులను పెదబయలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్ కుమార్ (17) అనే యువకుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో కుటుంబీకులు ఆసుపత్రిలో మృతదేహాన్ని స్వగ్రామం గేదలబందకు తరలించారు.

పిడుగు పడి బాలికకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని అంతర్ల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి పిడుగు పాటుకు ఇంట్లో నిద్రిస్తున్న బాలిక కోరాబు హారిక కుడి చేతికి స్వల్ప గాయం అయింది. విద్యుత్ మీటర్, బోర్డు పూర్తిగా ధ్వంసం అయ్యాయని ఇంటి యజమాని కోరాబు మోహన్‌రావు తెలిపారు.

గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడిలో మాజీ సర్పంచ్ కె.రమణ నివాసంలో వంట గ్యాస్ లీకై ఇరువురు మహిళలు గాయపడ్డారు. సోమవారం రమణ భార్య మణి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో మణి తో పాటు రమణ పిన్నమ్మ వీర్రాజు గాయపడ్డారు. స్థానికులు గమనించి హుటాహుటినా నక్కపల్లి సిహెచ్‌సికి తరలించారు.వైద్యులు ప్రథమ చికిత్సను అందించారు. కుటుంబ సభ్యులు గాయపడ్డ వారిని మెరుగైన వైద్యం కోసం విశాఖ తీసుకువెళ్లారు.

పలుచోట్ల మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట గ్రామంలో సోమవారం 73 మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో దాడులు నిర్వహించి గాలి నూకరాజు వద్ద ఈ మద్యం సీసాలను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాడుగుల: మాడుగులలో అక్రమంగా నిలువచేసిన రూ.20వేల విలువగల మద్యం సీసాలను మాడుగుల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బంది పట్టుకున్నారు. 119 మద్యం సీసాలతో సోమవారం మధ్యాహ్నం ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్సై కే.హనుమంతు ప్రకటనలో పేర్కొన్నారు. మాడుగులలోని రాజ వీధిలో బెజవాడ రాజేష్ వ్యక్తి గృహం బయట అక్రమంగా నిలువ ఉంచిన 119 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులలో ఎస్ఈబి పాల్గొన్నట్లు ఎస్సై కె.హనుమంతు తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : అనారోగ్య కారణాలతో సోమవారం మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు పిఎం పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వివరాలివి. జివిఎంసి ఏడవ వార్డు మిథిలాపురి వుడాకాలనీకి చెందిన ఎస్ గంగాభవాని(54) కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించినా నయం కావడంతో తీవ్ర మనోవేదనకు గురవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయిన ఆమె ఆచూకీ కోసం . కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. దాంతో పోలీసులు సమాచారం అందించారు. సాయంత్రం వాంబే కాలనీకి వెళ్లే దారిలో చెట్టుకు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడు రామాంజనేయ రెడ్డి ఫిర్యాదు మేరకు హెచ్‌సి దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

ఈదురుగాలులతో వర్షం

- రహదారికి అడ్డంగా విరిగిపడ్డ వృక్షాలు

విరిగిపడ్డ చెట్లను తొలగిస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి-చింతూరు : మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది. ఈదురుగాలులకు రహదారులపై చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడంతో రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. వారం రోజులుగా నిప్పుల కొలిమిలా మండిపోయే వాతావరణంలో పశుపక్షాదులు మనుషులు సైతం అల్లాడిపోయారు. వేసవి తాపానికి గురైన జీవకోటికి ఈ వర్షం ఉపశమనం కల్గించింది.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు 14న రక్తదానం చేద్దాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సోమవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ సిఎంఎస్ వద్ద ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడబ్ల్యుసి-, ఉక్కునగరంలో ఈనెల 14న నిర్వహించనున్న 'స్టీల్ ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దాం' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అయోధ్యరామ్ మాట్లాడుతూ 2018 నుంచి స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ప్రధాన ఆశయంతో ఈనెల 14న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 1200 రోజులకు పైగా విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇదొక ప్రయత్నంగా ప్రతి కార్మికుడు భావించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కొత్తగా అధికారంలోకి రానున్న ప్రభుత్వాలు దీనిపై పునరాలోచించి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. .అంతవరకు పోరాటాన్ని వివిధ రూపాలలో కొనసాగిస్తామనిస్పష్టం చేశారు. కనుక పోరాట పటిమను, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిద్దామన్న కోరికపై గల నిబద్ధతను ప్రదర్శించే విధంగా అత్యధిక మంది రక్తదానంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం కార్మికుల సౌకర్యాలను, హక్కులను కాలరాస్తుంటే గుర్తింపు యూనియన్ చోద్యం చూస్తోందని ఘాటుగా విమర్శించారు. ఇంతమంది కార్మికులను సమాజం ముందు దొంగలుగా, దోషులుగా నిలబెట్టే హక్కు యాజమాన్యానికి ఎక్కడిదని ప్రశ్నించారు. యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లిస్తే కార్మికుల వ్యక్తిత్వ హననం జరిగేది కాదని, దీనిని రాజ్యాంగం కల్పించిన హక్కుగా కాకుండా తమ దయగా యాజమాన్యం భావించడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యోగుల ఇళ్లకు విద్యుత్ ఛార్జీల పెంపుపై కోర్టులను ఆశ్రయించి, యాజమాన్యం అనాలోచిత, అసందర్భ నిర్ణయాలకు విరుద్ధంగా న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రానున్న కాలంలో ఇదే రీతిలో యాజమాన్య వైఖరిని ప్రదర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, కె గంగాధర్, టివికె రాజు, నీలకంఠం, కష్ణమూర్తి, కెవి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, దేముడునాయుడు, శశిరెడ్డి, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, శ్రీరామ చంద్ర మూర్తి, పిజికె రాజు, సంజీవి. వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

- మారేడుమిల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వీర కిషోర్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించారని, అధికారులు చొరవ చూపి వెంటనే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, అనుమతులు లేని కట్టడాలను తొలగించాలని మారేడుమిల్లి గ్రామ సర్పంచ్ కొండ జాకబ్ డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కుమారి సార్ల లలిత కుమారి ఆధ్యక్షతను సోమవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో నెలకొన్న పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. మారేడుమిల్లి సర్పంచ్ కొండ జాకబ్ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయి రోడ్లన్నీ మురుగునీటితో నిండిపోయి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రోడ్లన్నీ అపారిశుధ్యంగా, చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే శుభ్రం చేయాలని కోరారు. జీఎం వలస సర్పంచ్ కారం లక్ష్మి మాట్లాడుతూ వాలమూరు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను అటవీశాఖ వారు స్వాధీనం చేసుకొని పర్యాటకుల గెస్ట్ హౌస్‌గా ఉపయోగిస్తున్నారని తెలిపారు. వెంటనే మండల విద్యాశాఖ అధికారి దీనిపై చొరవ తీసుకోవాలని కోరారు. మండల విస్తరణ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల ప్రజలు మలేరియా వంటి వ్యాధులకు గురవుతున్నారని, వెంటనే అన్ని గ్రామాల్లో ఆయా పంచాయతీ అధికారులు శానిటేషన్ పనులు చేశాయని సూచించారు. సిడిపిఓ ప్రసన్న మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఐదు సంవత్సరాల నిండిన పిల్లల పేర్లు అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆధార్ కార్డు తప్పనిసరి చేయించుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి కొరత లేకుండా బోర్లు, చేతిపంపులు రిపేర్ చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పిటిసి గొర్లె బాలాజీబాబు, మండల కోఆప్షన్ నెంబర్ గురుకు ధర్మరాజు, ఎంపిడిఒ ఎ.వీరకిషోర్, పరిపాలనాధికారి జయంతి, ఏబీపీ మనస్విని, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం

మాట్లాడుతున్న విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : న్యాయస్థానాలలో పెండింగ్ ఉన్న 70నుంచి 90శాతం వరకు కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, అధ్యక్షులు, ఆలపాటి గిరిధర్ అన్నారు. సుప్రీంకోర్టుకు చెందిన మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ, (ఎంసిపిసి), ఆంధ్ర ప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ, సూచనలతో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 29 మంది న్యాయవాదులకు ఐదు రోజులు శిక్షణను సోమవారం ప్రారంభించారు.

నూతన జిల్లా కోర్టు ప్రాంగణం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన శిక్షణలో ఎంసిపిసి జాతీయ శిక్షకులు, ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి నిషా సక్సేనా, ఢిల్లీ జ్యూడిషియల్ అకాడమీ డైరెక్ట డాక్టర్ అదితి అగర్వాల్ మాట్లాడుతూ, మధ్యవర్తిత్వ మెళకువలు న్యాయమూర్తులు తెలుసుకొని, కేసులకు అన్వయించి కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏడవ అదనపు సివిల్ (సీనియర్ డివిజన్) న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎ.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు : సిఐ

ప్రజాశక్తి- పద్మనాభం : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో అమల్లో ఉన్న ఎన్నికల కోడ్, ఇతర ఆంక్షలకు అతిక్రమించొద్దని స్థానిక సిఐ సిహెచ్.శ్రీధర్ సూచించారు. ఈ నెల 6వ తేదీవరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, దీనికి అనుబంధంగా కౌంటింగ్ రోజున పోలీస్‌యాక్ట్ 30, సిఆర్‌పిసి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇద్దరు కంటే ఎక్కువమంది గుమిగూడి ఉండరాదని, ఫలితాలు వెల్లడి తర్వాత విజయోత్సవ సంబరాలు, ఊరేగింపులు, ర్యాలీలు, బాణసంచా పేల్చడం నిషేధమన్నారు. గెలిచామన్న ఆనందంలో ఎవరైనా హద్దుమీరి ప్రవర్తించినా, రెచ్చగొట్టేలా వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి వారిపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. అన్ని పార్టీల రాజకీయ నేతలు సంయమనంతో వ్యవహరించాలని, ప్రశాంతతకు మారుపేరని పద్మనాభానికి ఉన్న మంచిపేరును చెడగొట్టవద్దని హితవు పలికారు. మూడురోజుల పాటు మద్యం అమ్మకాలపై నిషేధం ఉన్నందున ఎవరైనా తాగిన మత్తులో గొడవ చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

ఆనందపురం : సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిఐ తిరుపతిరావు తెలిపారు. గుంపులుగా తిరగడం, కొట్లాటలు, గొడవలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే రౌడీ షీట్ నమోదు చేస్తామన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ప్రజలందరూ సహకరించి, కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు పోలీసులకు సహకరించాలని కోరారు.

కండిషన్ లేని బస్సులతో కష్టాలు

- ఎక్కడికక్కడే తరచూ నిలిచిపోతున్న ఆర్‌టిసి బస్సులు
- పదేపదే ఇబ్బంది పడుతున్న ప్రయణికులు

మరమ్మతులకు గురైన డొంకరాయి- పాడేరు బస్సు

ప్రజాశక్తి -సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డిపోకు చెందిన పాడేరు -డొంకరాయి బస్సు సోమవారం ఉదయం మరమ్మతులకు గురై అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఆదివారం రాత్రి డొంకరాయిలో నైట్ హాల్ట్ ఉన్న ఈ బస్సు సోమవారం ఉదయం నాలుగు గంటలకు డొంకాయలో బయలుదేరింది. సీలేరుకు వస్తుండగా మార్గమధ్యలో బస్సు క్లచ్ నుంచి క్లచ్ ప్లేట్లుకి వెళ్లే మార్గంలో పైపు రంధ్రం కావడంతో ఆయిల్ పూర్తిగా కారిపోవడంతో బస్సులో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును సీలేరుకు ఉదయం ఐదు గంటలకు తీసుకొచ్చారు. ఆ బస్సులో ఉన్న ప్రయాణికులను సీలేరు నుంచి వైజాగ్ వెళ్లే సీలేరు నైట్ హాల్ట్ బస్సులో ఎక్కించారు. అనంతరం బస్సు సిబ్బంది స్థానిక మెకానిక్ ఈశ్వరరావును తీసుకొచ్చి రంధ్రాన్ని మూసివేసి బస్సుకు అమర్చారు. దీంతో సోమవారం మధ్యాహ్నం సీలేరు నుంచి 12 గంటలకు బస్సు బయలుదేరి పాడేరు వెళ్ళింది. ఏజెన్సీ ఘాట్ రోడ్డులో కండిషన్ లేని బస్సులు ఆర్టీసీ అధికారులు నడుపుతుండడంతో ఈ పరిస్థితి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో బస్సులు మరమ్మతులకు గురికావడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోయారు. కండిషన్ కలిగిన బస్సులు నడిపి ప్రయాణికులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సురక్షిత ప్రయాణం కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి కౌంటింగ్ ఏజెంట్లతో రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాలయ్య శాస్త్రి లేఔట్ లోని ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఏజెంటు అభ్యర్థిని డిక్లర్ చేసేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటు పొరపాటున వేరే వాళ్ళ దగ్గరికి వెళ్లిన తక్షణమే రాతపూర్వకంగా ఆర్ఒకు లెటర్ ఇవ్వాలని సూచించారు. ఉదయం 6 గంటలకు అంతా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు విషయంలో ఎప్పుడూ లోకల్‌గా ఉండే సర్వేలో చూసుకోవాలని అన్నారు. మెజార్టీ ప్రజలువైసిపికి ఓటేశారని,జగన్మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎస్ఆర్ షాపింగ్ మాల్ అధినేత గోపీనాథ్‌రెడ్డి, సత్తి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు